

రీలొకేషన్ ఎప్పుడో!
కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కోర్ ఏరియా లోని గ్రామాల తరలింపు ప్రక్రియ తుది దశకు చేరింది. రీలొకేషన్ కాలనీ పనులు పూర్తి చేసి వసతులు కల్పిస్తున్నారు. 8లో ▸



అడుగడుగునా గుంతలు
ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లో పలు గ్రామాలను కలిపే రింగ్‌రోడ్డు అడుగడుగున గుంతలు పడింది. మారుమూల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 9లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /19.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. రాత్రివేళ చలి కొనసాగుతుంది.

పరిష్కారం దొరికేనా?

- నాగోబా 'దర్బార్' అర్జీల పరిశీలన
- శాఖలవారీగా విభజిస్తున్న సిబ్బంది
- పరిష్కారానికి ఆదివాసీల నిరీక్షణ



నాగోబా ఆలయంలో ఆదివాసీలతో ముచ్చటిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క. పక్కన ఎంపీ బాపూరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు (ఫైల్)

సాక్షి, ఆదిలాబాద్: 'మేము చెప్పే సమస్యలు ప్రభుత్వం అధికారికంగా మినట్స్‌లో నమోదు చేసుకోవాలి.. వాటిని పరిష్కరించి మాకు దారి చూపాలి.. ఫండ్స్ రిలీజ్ చేసి అభివృద్ధికి పాటుపడాలి.. ఇవే సమస్యలను మేము వచ్చే దర్బార్ దృష్టికి తేకుండా చూడాలి.. అర్జీలు తీసుకుంటూ సమస్యలు పరిష్కరించడంలేదు.. లోన్ కోసం దరఖాస్తు చేసుకుంటే మంజూరు ఇచ్చినా ఆ తర్వాత మేము అడిగిన మేర రుణం ఇవ్వడం లేదు.. ఇలాంటి పరిస్థితుల్లో మా ఆర్థిక అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది..' ఇవి ఇటీవల ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా జాతరలో భాగంగా నిర్వహించిన దర్బార్‌లో ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఆదివాసీ తెగలకు చెందిన ముఖ్య నాయకులు చెప్పిన మాటలు..

యోగ్యత కలిగినవాటికే మోక్షం

నాగోబా జాతర ఈనెల 9న ప్రారంభమై 15వ తేదీన ముగిసింది. మధ్యలో 12వ తేదీన దర్బార్ నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. దర్బార్ వేదిక మీద ఆదివాసీల్లోని వివిధ తెగల ముఖ్య నేతలు ప్రసంగించారు. నాగోబా దర్బార్‌లో తాము ఇచ్చే అర్జీలను పరిష్కరించాలని వేడుకున్నారు. దీని ప్రాముఖ్యతను కాపాడాలని విన్నవించారు. మళ్లీమళ్లీ ఇవే సమస్యలు చెప్పుకొనే పరిస్థితి రాకుండా చూడాలని ప్రజాప్రతినిధులను కోరారు. ప్రభుత్వం అధికారికంగా మినట్స్‌లో తాము చెప్పే సమస్యలు నమోదు చేస్తుందా? అని ఆదివాసీలు సందేహం వ్యక్తం చేయగా, వారి తర్వాత ఇదే వేదిక మీదుగా మాట్లాడిన కలెక్టర్ దర్బార్‌లో వచ్చిన విజ్ఞప్తులను మినట్స్‌గా రూపొందిస్తున్నట్లు తెలిపారు. పరిష్కారానికి యోగ్యమయ్యే విజ్ఞప్తులపై తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. మిగతావి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

594 దరఖాస్తులు..

నాగోబా దర్బార్‌లో ఆదివాసీల నుంచి 594 దరఖాస్తులు వచ్చినట్లు ఐటీడీఏ అధికారులు స్పష్టం చేశారు. ఇందులో 325 దరఖాస్తులు రుణాలు ఇప్పించాలని వచ్చినవే. మిగతా 269 దరఖాస్తులు ఇతర పథకాల కోసం వచ్చాయి. దర్బార్ ముగిసి 10 రోజులు దాటింది. ఈ విజ్ఞప్తులపై ఐటీడీఏ అధికారులు దృష్టి సారించారు.

వసతులు మెరుగుపర్చాలని..

దర్బార్ వేదికగా ఆదివాసీ తెగలోని ముఖ్య నేతలు ప్రసంగిస్తూ.. ఏజెన్సీలో విద్య, వైద్యం అభివృద్ధి కోసం పాటుపడాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఉట్నూర్ లాల్‌టేకిడిలోని డీఎడ్ కళాశాలను ఎందుకు మూసేశారు.. ఆదివాసీల అభ్యున్నతి కోసం పాటుపడిన మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్‌డార్ఫ్ పేరిట ఉన్న ఆ కళాశాలను అర్ధంతరంగా మూసి గిరిజన బిడ్డల ఉన్నత చదువులకు మార్గం లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉట్నూర్‌లోని బీఎడ్ కళాశాల, డీఎడ్ కళాశాలలో ఇప్పటివరకు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. టీచింగ్ పోస్టులు లేకపోవడంతో ఈ కళాశాలలో విద్యనభ్యసించే వారికి సరైన బోధన అందని పరిస్థితి ఉందని చెప్పుకొచ్చారు. ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాలని పదేపదే వేడుకుంటున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో గిరిజన యూనివర్సిటీని ఉట్నూర్‌కు మంజూరు చేస్తారని ఆశించినా అది జరగలేదని, కనీసం ఇతర విద్యాసంస్థలు కేటాయించి ఈ ప్రాంతంలో విద్యాభివృద్ధికి పాటుపడాలని కోరారు. పలు గ్రామాలకు రోడ్లు, కరెంట్ సౌకర్యాలు లేవని, వాటిని పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. లెక్కలో ఉన్న భూమి కంటే తక్కువ భూమికి పోడు పట్టాలు ఇవ్వడం ద్వారా ఆదివాసీలకు పోడు పట్టాలు లభించిన ఆనందం కూడా లేదని వాపోయారు. వీటన్నింటినీ పునఃపరిశీలించి ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడాలని కోరారు.

పరిష్కారం చూపాలి



కేస్లాపూర్‌లోని నాగోబా జాతరలో భాగంగా నిర్వహించిన దర్బార్‌లో ఆదివాసీలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించి వారికి దారి చూపాలి. నిధులు విడుదల చేసి అభివృద్ధికి సహకరించాలి. విద్య, వైద్యం అందేలా చూడాలి.

– మెస్రం తుకారాం, ఆదివాసీ నేత

శాఖలవారీగా విభజిస్తున్నాం



దర్బార్‌లో వచ్చిన అర్జీలకు సంబంధించి శాఖలవారీగా విభజిస్తున్నాం. ఈ ప్రక్రియను త్వరలోనే పూర్తి చేస్తాం. వీటి పరిష్కార విషయంపై దృష్టి సారిస్తాం. సంక్షేమ పథకాలను గిరిజనులకు అందేలా చర్యలు తీసుకుంటాం.

– ఖుష్బూ గుప్తా, ఐటీడీఏ పీవో, ఉట్నూర్

న్యూస్‌రీల్

డీలర్లపై చర్య తీసుకోవాలి

ఇచ్చోడ: అధిక ధరకు యూరియా విక్రయిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెం బొర్రన్న డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సహకార సంఘం ద్వారా యూరియా బస్తా రూ.270కి విక్రయిస్తే ప్రైవేట్ డీలర్లు రూ.320కి విక్రయిస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయశాఖ పర్యవేక్షణ లోపంతోనే అధిక ధరకు యూరియా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధిక ధరకు యూరియా విక్రయించకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న రఘుతేజ

ఆదిలాబాద్‌టౌన్: సాంకేతికతను అందిపుచ్చుకుని నైపుణ్యాలను మరింతగా మెరుగుపర్చుకోవాలని నిజామాబాద్ ఐటీ హబ్ రీజినల్ సెంటర్ మేనేజర్ బీ రఘుతేజ సూచించారు. సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆప్టిట్యూడ్, రీజనింగ్ అనే రెండు అంశాలపై రెండురోజుల పాటు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, టాస్క్ కళాశాల ఇన్‌చార్జి డాక్టర్ బీ జ్యోత్స్నారాణి లాజికల్, డెసిషన్ మేకింగ్, సమస్యల పరిష్కారం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ పీ భరద్వాజ, విభాగాధిపతులు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'హామీల అమలులో బీజేపీ ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న శ్రావణ్‌నాయక్

ఆదిలాబాద్‌రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హామీల అమలులో విఫలమైందని కాంగ్రెస్ పార్లమెంట్ నాయకుడు, అడ్వకేట్ శ్రావణ్‌నాయక్ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు బీజేపీ ప్రభుత్వం ఏంచేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ ఎంపీ స్థానం కాంగ్రెస్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు మహ్మద్ రఫీక్, ఎంఏ షకీల్, సయ్యద్‌వర్మ, పోతరాజ్ సంతోష్, మొయిన్ అహ్మద్, రూపేశ్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2024–25 విద్యాసంవత్సరానికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో రామాంతపూర్‌లో ఒకటో తరగతిలో లక్కీ డ్రా ద్వారా ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీతాకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థులు ఈ నెల 24నుంచి మార్చి 12వ తేదీ వరకు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. 1.6.2017 నుంచి 31.5.2018 మధ్య జన్మించిన జిల్లాకు చెందిన వారే దరఖాస్తుకు అర్హులని తెలిపారు. దరఖాస్తుకు కులం, నివాసం, ఆదాయం, బర్త్ సర్టిఫికెట్లు జతచేయాలని సూచించారు. తల్లిదండ్రుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాలవారికి రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షలలోపు ఉండాలని తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం డీఐఈవో కార్యాలయంలో ఇంటర్ పరీక్షలపై సీఎస్, డీవోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్షాకేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని సూచించారు. జిల్లాలో 30 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రథమ, ద్వితీయ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 21,527 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యాలు హాల్‌టికెట్లివ్వకుంటే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. డీఐఈవో రవీందర్‌కుమార్, డీఈసీ సభ్యులు, సీఎస్, డీవోలున్నారు.

ఎన్నికల్లో పాల్గొంటేనే అభివృద్ధి



గ్రామస్తుల సమస్యలు వింటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్ రాజ్

తాంసి: ఎన్నికల్లో పాల్గొని ఓటేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించిన భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామాన్ని శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాల వద్ద గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలు విన్నారు. కొద్దిరోజులుగా మిషన్ భగీరథ నీరు రావడంలేదని గ్రామస్తులు తెలుపగా కలెక్టర్ స్పందించారు. నీరు సరఫరా కాకపోవడానికి కారణం ఏమిటని మిషన్ భగీరథ ఏఈ చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. నీరు సరఫరా కాకపోతే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. రేపటిలోగా నీటిని సరఫరా చేస్తామని ఏఈ కలెక్టర్‌కు వివరించారు. నీరు సరఫరా చేశారా? లేదా? అని గ్రామస్తులకు స్వయంగా ఫోన్ చేసి తెలుసుకుంటానని భరోసానిచ్చారు. గ్రామానికి ప్రధానంగా రోడ్డుతోపాటు ఇళ్లకు విద్యుత్ లేక ఇబ్బంది పడుతున్నామని తెలియజేశారు. రోడ్డు సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. ఉపాధిహామీ బిల్లులు త్వరగా చెల్లించాలని కోరారు. అనంతరం కలెక్టర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు పరిశీలించారు. వారి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలను త్వరగా పూర్తిచేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. విడతల వారీగా గ్రామ సమస్యలు పరిష్కరించి అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవాలని తెలిపారు. ఉచిత విద్యుత్, గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకోనివారు ఉపయోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సత్యనారాయణరావు, ఎంపీడీవో గోపీకృష్ణారెడ్డి, మిషన్ భగీరథ ఏఈ చంద్రశేఖర్, ఏఈ మహేశ్, ఆర్ఐ అశోక్, ఉపాధ్యాయులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

కార్యదర్శికి షోకాజ్ నోటీసులు!

గొల్లఘాట్ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గొల్లఘాట్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ప్రసాద్ విధులకు సరిగా హాజరు కావడం లేదు. విధులు కూడా సరిగా నిర్వహించడం లేదని గ్రామస్తులు కలెక్టర్ కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ షోకాజ్ నోటీస్ జారీ చేసి వివరణ కోరాలని అధికారులను ఆదేశించారు.

క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించాలి



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఈశ్వరీబాయి

నార్నూర్: క్రమశిక్షణతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి సూచించారు. శుక్రవారం జీసీడీవో ఛాయతో కలిసి మండలంలోని జామడ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలోకి వెళ్లి భోజనం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. కుమురంభీం జీసీడీవో శకుంతల, ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ నెహ్రూ తదితరులున్నారు.

'పీఎం విశ్వకర్మ'కు దరఖాస్తు చేసుకోవాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పథకం అమలుపై ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. పథకంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి అర్హులంతా దరఖాస్తు చేసుకునేలా చూడాలని సూచించారు. కులవృత్తిదారులకు ఈ పథకం కింద 5శాతం తక్కువ వడ్డీకి రుణంతో పాటు రాయితీ పొందవచ్చని తెలిపారు. చేతివృత్తులవారికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, రేషన్‌కార్డు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారులకు మొదటి విడతలో రూ.లక్ష రుణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నిర్ణీత సమయంలో చెల్లిస్తే తిరిగి రూ.2లక్షల రుణం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పరిశ్రమలశాఖ జిల్లా జనరల్ మేనేజర్ పద్మభూషణ్‌రాజు, జెడ్పీ డిప్యూటీ సీఈవో కలిందిని, డీపీవో శ్రీలత, ఎల్‌డీఎం భాస్కర్, సీఎస్‌ఈ జిల్లా మేనేజర్ రాహుల్, డీఎల్పీవో ఫణీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సదానందంగౌడ్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు వెంటనే చేపట్టాలని ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జీ సదానందంగౌడ్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యాశాఖకు గతం కంటే ఎక్కువ నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పీఆర్సీని ప్రకటించేలా తమ సంఘం ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. మండలానికో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, సంపన్న వర్గాల్లోని పేదలకు నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి రాష్ట్రంలో ఉపాధ్యాయుల కొరత, పర్యవేక్షణ అధికారుల కొరత ఉందని, ఒక ఎంఈవోకు నాలుగైదు మండలాల బాధ్యతలు అప్పగించడంతో సరైన రీతిలో పర్యవేక్షణ చేపట్టడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెజ్జంకి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి జాదవ అశోక్, పూర్వ జిల్లా అధ్యక్షుడు చిలుక విలాస్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న బృందం సభ్యులు

సిరికొండ: మండల కేంద్రంలోని కేజీబీవీలో శుక్రవారం సమగ్ర శిక్ష సామాజిక పరిశీలన చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన సామాజిక, ఆర్థిక అధ్యయన కేంద్ర బృందం (సెస్) పరిశీలించి సమగ్ర శిక్ష ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై అధ్యయనం చేశారు. పాఠశాల స్థితిగతులు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల శిక్షణ, సమగ్ర శిక్ష అభియాన్ అమలు గురించి తెలుసుకున్నారు, విద్యార్థులకు కావాల్సిన అయా సౌకర్యాలు, వసతులు తదితర వివరాలు సేకరించారు. జిల్లాలో ఎంపికైన పాఠశాలలను తనిఖీ చేసి సంబంధిత వివరాలు డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. ఎస్వో సంధ్యారాణి పాఠశాలకు కావాల్సిన మౌలిక వసతుల గురించి వివరించారు. సెస్ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ కే చంద్రశేఖర్, రీసెర్చ్ సూపర్‌వైజర్ రేణుక, ఉపాధ్యాయులున్నారు.

'లిఫ్ట్' ఇచ్చేదెప్పుడో!

- నిరుపయోగంగా మూడు ప్రాజెక్టులు
- రూ.20 కోట్ల ప్రజాధనం వృథా



సాంగ్వి వద్ద బిగించిన మూడు మోటార్లు



సాంగ్వి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్

జైనథ్: మండలంలోని సాంగ్వి, పెండల్‌వాడ, కేదర్‌పూర్ గ్రామాల సమీపంలో పెన్‌గంగ నది ఒడ్డున నిర్మించిన మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు నిరుపయోగమయ్యాయి. ఒక్కోదానికి రూ.6.13కోట్లు వెచ్చించగా సుమారు రూ.20 కోట్ల ప్రజాధనం వృథా అయింది. 2009లో ప్రాజెక్ట్ నిర్మాణానికి శాఖాపరమైన అనుమతులు వచ్చినా తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర ఏర్పాటు తదితర కారణాలతో పనులు మూలనపడ్డాయి. 2014–15లో ప్రాజెక్ట్ నిర్మాణం జోరందుకోగా ఎట్టకేలకు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల వద్ద మూడేసి మోటార్ల ఏర్పాటు, ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ పనులు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో దాదాపు రూ.20కోట్లు వెచ్చించి నిర్మించిన మూడు ప్రాజెక్టులు వృథాగా మారాయి.

2వేల ఎకరాల ఆయకట్టు..

సాంగ్వి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు 700 ఎకరాలు, కేదర్‌పూర్ ప్రాజెక్టుకు 700 ఎకరాలు, పెండల్‌వాడ ప్రాజెక్టుకు 600 ఎకరాలు కలిపి మొత్తం 2వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఒక్కొక్క ప్రాజెక్టులో 75 హెచ్‌పీ సామర్థ్యంగల మూడు మోటార్లు బిగించడంతో పాటు విద్యుత్ కనెక్షన్ కోసం ప్రత్యేకంగా ఒక్కో ప్రాజెక్టు వద్ద 250 కిలోవాట్ల ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తోడిన నీళ్లను నిల్వ ఉంచేందుకు వీలుగా ప్రత్యేక ట్యాంక్ నిర్మించారు. అయితే మోటార్ల నుంచి ట్యాంకుల వరకు నీళ్లను పంపించేందుకు పంటచేల నుంచి సిమెంట్, ప్లాస్టిక్ పైపులైన్లు వేశారు. ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయినప్పటికీ ఇప్పటివరకు వెట్‌రన్ చేపట్టలేదు. నీళ్ల విడుదల చేసేందుకు ప్రయత్నించిన ప్రతీసారి సిమెంట్ పైప్‌లైన్ పగిలిపోతుందని, నీళ్లు ట్యాంకులకు చేరడం లేదని రైతులు చెబుతున్నారు. సిమెంట్ పైప్‌లైన్లు పగిలిపోతుండటంతో పంటచేలలో నీళ్లు చేరి మునుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే సిమెంట్ పైపులకు బదులు స్టీల్ పైపులు వేస్తేగానీ ఈ సమస్య పరిష్కారమయ్యే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. కానీ, అధికారులు మాత్రం ఇప్పటివరకు పైప్‌లైన్ మార్చేందుకు ఎలాంటి ప్రతిపాదనలు సిద్ధం చేయలేదు. దీంతో ఈ మూడు ప్రాజెక్టుల భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి.

పత్తా లేని రైతు కమిటీలు

గతంలో ఈ ప్రాజెక్ట్ నిర్వహణ బాధ్యతలు ఐడీసీ చేపట్టేది. కానీ.. 2022లో ఈ బాధ్యతలను పెన్‌గంగ అధికారులకు బదిలీ చేశారు. అయితే ఈ ప్రాజెక్ట్ నిర్వహణపై రైతులు, అధికారుల్లో పూర్తిస్థాయి అవగాహన లేదు. దీంతో ప్రాజెక్టులు నిరుపయోగంగా మారాయి. ప్రాజెక్ట్ నిర్వహణ కోసం ఆయకట్టు పరిధిలోని రైతులతో కమిటీలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఆ దిశగా ఎలాంటి అడుగులు పడలేదు. దీంతో నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రాజెక్టులు ఏళ్లుగా నిరుపయోగంగా మారాయి.

లిఫ్ట్ ఇరిగేషన్‌ను ప్రారంభించాలి



దాదాపు రూ.6కోట్లతో సాంగ్విలో నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ వృథాగా మారింది. ప్రాజెక్ట్ పూర్తయినప్పటికీ సిమెంట్ పైప్‌లైన్ తరచుగా పగిలిపోవడంతో ఇంతవరకు ప్రాజెక్ట్‌ను ప్రారంభించలేదు. అధికారులు స్టీల్ పైప్‌లైన్ కోసం ప్రతిపాదనలు పంపించి, కొత్త పైప్‌లైన్ వేయించాలి. 700 ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తే వందలాది రైతు కుటుంబాలకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలి.

– విఠల్‌రెడ్డి, సాంగ్వి

బాక్సింగ్‌లో క్రీడాకారులకు మెడల్స్



మెడల్స్ సాధించిన క్రీడాకారులతో ప్రతినిధులు

కైలాస్‌నగర్: జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని రైల్వే స్టేడియంలో జరిగిన సబ్ జూనియర్ బాలురు, బాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో ఐదుగురు క్రీడాకారులు బంగారు, వెండి పతకాలు గెలుచుకున్నారు. బాక్సింగ్ టీం సభ్యులు బాలికల విభాగంలో అబ్దుల్ ఆఫియా జబీన్ బంగారు పతకం కైవసం చేసుకోగా, బీ అశ్విని, ఆర్ అనూష వెండి పతకాలు అందుకున్నారు. వీటితో పాటు బెస్ట్ లూసర్ అవార్డునూ అందుకున్నారు. బాలుర విభాగంలో షోయబ్ మాలిక్‌కు బంగారు పతకం, రామ్‌చరణ్‌కు సిల్వర్ మెడల్ లభించింది. క్రీడాకారులు మెడల్స్ సాధనకు కలెక్టర్, అధికారులున్నట్లు జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.విజయేందర్, ప్రధాన కార్యదర్శి అక్తర్‌బేగ్ తెలిపారు. బాక్సింగ్ కోచ్‌గా ఉన్న సాయికుమార్ గౌడ్ కూడా విజేతలకు తన సహకారం అందించారని తెలిపారు. జిల్లాలో ఎంతోమంది మరుగునపడిన క్రీడాకారులున్నారని తెలిపారు. వారినివెలికితీసి బాక్సింగ్‌లో ప్రావీణ్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వారు అభినందించారు.

క్లుప్తంగా

జిల్లా జైలును సందర్శించిన డీజీ సౌమ్య



పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా శుక్రవారం జిల్లా జైలును సందర్శించారు. ఆమె జిల్లాకు వచ్చిన సందర్భంగా ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, జిల్లా జైలు సూప రింటెండెంట్ అశోక్ కుమార్, పట్టణ సీఐలు కె.సత్యనారాయణ, అశోక్, అదనపు డీజీతో పాటు జైలు శాఖ ఐజీ మురళీబాబు, వరంగల్ రేంజ్ డీజీపీ సంపత్ కుమార్ సైతం స్వాగతం పలికారు.

షార్ట్ సర్క్యూట్‌తో గడ్డి దగ్ధం



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

కడెం: మండలంలోని నవబ్‌పేట్ గ్రామంలో శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రాపెల్లి సతీశ్‌కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. వివరాల ప్రకారం... సతీష్‌కు చెందిన గడ్డివాముపై ఉన్న స్తంభం వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి 90 గడ్డికట్టలు, సెంట్రింగ్ కర్రలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. అలాగే గుమ్ముల భూమన్న ఇల్లు సైతం పాక్షికంగా దగ్ధమైంది. ఖానాపూర్ నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

అమృత్ పథకంలో బాసర రైల్వేస్టేషన్



బాసర రైల్వే స్టేషన్

భైంసా: చదువుల తల్లి నిలయమైన బాసరలోని రైల్వే స్టేషన్ అమృత్ భారత్ పథకంలో ఎంపిక చేసినట్లు హైదరాబాద్ డివిజన్ సీనియర్ మేనేజర్ వి. విద్యాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి మోడీ ఈనెల 26న వర్చువల్ విధానంలో 500 స్టేషన్లను ఈ పథకం కింద శిలాఫలకం వేయనున్నారు. ఆదిలాబాద్ పార్లమెంటు పరిధిలోని బాసర రైల్వేస్టేషన్‌ను ఎంపీ సోయంబాపురావు ప్రారంభించనున్నట్లు సమాచారం. దీంతో బాసర స్టేషన్ రూపురేఖలు పూర్తిస్థాయిలో మారనున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

భైంసారూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన మండలంలోని వానల్‌పాడ్ గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... నిర్మల్ నుంచి అభిలాశ్, ఆనంద్ అనే యువకులు ద్విచక్రవాహనంపై భైంసాకు వస్తున్నారు. వానల్‌పాడ్ సమీపంలో వంతెనకు బైక్ ఢీకొట్టగా అభిలాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆనంద్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వారిని 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల కోసం అభిలాశ్‌ను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



పూనకాలతో శివసత్తులు

జయహో.. గజ్జలమ్మ

- బోనమెత్తిన ఆడపడుచులు
- ముగిసిన వార్షికోత్సవ వేడుకలు

కుంటాల: జయహో గజ్జలమ్మ.. జైజై గజ్జలమ్మ నామస్మరణతో కుంటాల శుక్రవారం మారుమోగింది. ఆలయ 4వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఉదయం నిత్యనిధి, మహాపూర్ణ హారతి, కుంభాభిషేకం వంటి కార్యక్రమాలు వేద పండితుడు గురుమంచి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆడపడుచులు బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకొని ప్రత్యేకంగా తయారు చేసిన బురెలు, పాయసం అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉపాధ్యాయుడు దాండేవార్ శాంతాబాయి – సాహెబ్‌రావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ముధోల్ మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్, ఎంపీపీ అప్క గజ్జారాం యాదవ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జుట్టు అశోక్, రిటైర్డ్ ఆర్డీవో గజ్జన్న, భైంసా కోర్ట్ ఏపీపీ అరుణ, సీఐ శ్రీనివాస్, ఎస్సై హన్మాండ్లు, మాజీ ఎంపీపీలు బోజారాం పటేల్, రాంచందర్‌రెడ్డి, ఓం ప్రకాష్ లడ్డా పూజలు చేశారు.



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు

నేడు అక్కకొండ జాతర

- లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కడెం: మండలంలోని దిల్దానగర్ సమీపంలోని అక్కకొండ లక్ష్మీనరసింహుడి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు, అభిషేకం, మంగళశాసనం, మూలమంత్ర హవనం, బలిహారణ పూజ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు వొద్దిపర్తి వెంకటరమణాచార్యులు తెలిపారు. శనివారం లక్ష్మీనరసింహ రథోత్సవం, జాతర కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జగ్గరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రాజారమేశ్‌గౌడ్, తెలిపారు.

రీలొకేషన్ ఎప్పుడో?

- తుది దశకు పునరావాస గ్రామాల పనులు
- తరలింపుపై నిర్ణయం తీసుకోని అటవీశాఖ



అధికారులతో మాట్లాడుతున్న పీసీసీఎఫ్ డోబ్రియల్



రీలొకేషన్ కాలనీలో నిర్మించిన ఇళ్లు

కడెం: కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కోర్ ఏరియాలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాల తరలింపు ప్రక్రియ తుది దశకు చేరింది. రాంపూర్, మైసంపేట్ గ్రామాలను ఖాళీ చేయించి, మండలంలోని కొత్త మద్దిపడగ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న విలేజ్ రీలొకేషన్-1కు తరలించనున్నారు. రీలొకేషన్ సైట్‌లో ఇళ్ల నిర్మాణాలు, పెత్తర్పు సమీపంలో వ్యవసాయ భూమిని ఆదివారం పీసీసీఎఫ్ ఆర్ఎం.డోబ్రియల్, ఎఫ్డీపీటీ శాంతరాం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయించాలని అటవీ అధికారులను ఆదేశించారు.

రూ.11 కోట్ల వ్యయంతో కాలనీ..

మండలంలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాల్లో 142 కుటుంబాలుండగా 94 మందికి ఇళ్లు, మండలంలోని పెత్తర్పు వద్ద 2 ఎకరాల, 32 గుంటల వ్యవసాయ భూమి అందజేయనున్నారు. 48 మందికి పునరావాస ప్యాకేజీ-2 కింద రూ.15 లక్షల చొప్పున అందిస్తారు. కొత్త మద్దిపడగ సమీపంలో రూ.11కోట్లు వెచ్చించి 94ఇళ్ల నిర్మాణం చేపట్టారు.

నాణ్యతపై అసంతృప్తి

కొత్తమద్దిపడగ గ్రామ సమీపంలో నిర్మించిన పునరావాస కాలనీలో డ్రెయినేజీలు, రోడ్లు, టాయిలెట్లు నాసిరకంగా నిర్మించారని రాంపూర్, మైసంపేట్ వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 8న రీలొకేషన్ సైట్ విజిట్‌కు వచ్చిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. కానీ, కలెక్టర్ తమ సమస్యపై స్పందించలేదని రెండు గ్రామాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. తడోబాలో కల్పించిన విధంగా తమకు పునరావాసం కల్పిస్తామని చెప్పిన అటవీ అధికారులు మాట తప్పారని అంటున్నారు. అన్ని సౌకర్యాలు కల్పిస్తేనే ఇక్కడకు వస్తామని స్పష్టం చేస్తున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



గ్రామాలను తరలిస్తామని అటవీ అధికారులు మమ్మల్ని తడోబా టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పునరావాస కాలనీకి తీసుకెళ్లారు. ఇక్కడలా కాలనీ నిర్మిస్తామని తెలిపారు. కానీ అప్పుడు చెప్పిన విధంగా ఇక్కడి పనులు లేవు. ఇలా అయితే గ్రామాన్ని ఖాళీ చేయం.

– గాదె బుచ్చవ్వ, రాంపూర్

తుది దశకు పనులు..



రీలొకేషన్ కాలనీ పనులు తుది దశకు చేరాయి, పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేయిస్తాం. రీలొకేషన్‌లో భాగంగా ఇవ్వనున్న వ్యవసాయ భూముల హద్దులు ఏర్పాటు చేయించాం. గ్రామాల తరలింపుపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– అనిత, ఎఫ్ఆర్వో, కడెం

రైతులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి

- మహిళ అభివృద్ధి సంస్థ(ఏపీమాస్) డైరెక్టర్ మురళి



రైతులతో మాట్లాడుతున్న మురళి

లోకేశ్వరం: రైతులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని మహిళా అభివృద్ధి సంస్థ(ఏపీమాస్) డైరెక్టర్ ట్రెయినింగ్ మురళి అన్నారు. మండలంలోని ధర్మోర గ్రామంలో లోకేశ్వరం మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ నుంచి సబ్సిడీపై అందజేసిన పసుపు ఉడికించే మిషన్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో మహిళా ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సంఘాల ద్వారా రైతులు ఎరువులు, పురుగు మందులను సంఘం నిర్ణయించిన ధరలకు పొందవచ్చని తెలిపారు. మండల రైతులకు అందుబాటులో ఉండేందుకు రెండు పసుపు ఉడకబెట్టే యంత్రాలు అందించామని పేర్కొన్నారు. వివిధ పంటలపై రైతులకు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా మహిళా అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ రాజేశ్వర్, రైతులు ఉన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వేదిక ప్రతినిధులు

కైలాస్‌నగర్: ఈ నెల 25న జరిగే తెలంగాణ రచయితల వేదిక 8వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదారి నారాయణ, జిల్లా అధ్యక్షుడు బాలసాని నారాయణ గౌడ్ కోరారు. శుక్రవారం ఆ మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో తెలంగాణ రచయితల వేదిక కీలక పాత్ర పోషించిందన్నారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభలకు సుప్రీంకోర్టు రిటైర్డు జడ్జీ బి.సుదర్శన్ రెడ్డి, ప్రముఖ కవి అందెశ్రీ, ఆంధ్రజ్యోతి సంపాదకులు శ్రీనివాస్, జయధీర్ తిరుమల్‌రావు, జూకంటి జగన్నాథం ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లుగా తెలిపారు. జిల్లాలోని కవులు, రచయితలు, కళాకారులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

చివరిచూపు కోసం 24 రోజులు..

- ఎనిమిది నెలల క్రితం వివాహం
- గల్ఫ్ వెళ్లిన నాలుగు నెలలకే..
- గల్ఫ్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో మండలవాసి మృత్యువాత



వెంకటేశ్ (ఫైల్)



నివాళులర్పిస్తున్న గల్ఫ్ అసోసియేషన్ నాయకులు

జన్నారం: ఉన్న ఊరిని.. కట్టుకున్న భార్యను.. కనిపెంచిన తల్లీదండ్రులను వదిలి ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన యువకుడు శవమై తిరిగొచ్చాడు. బ్రేన్ స్ట్రోక్‌తో 24 రోజుల క్రితం మృతిచెందగా అప్పటి నుంచి చివరి చూపు కోసం కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు. జన్నారం మండలం దేవునిగూడ గ్రామానికి చెందిన కునారపు వెంకటేశ్(24) ఎనిమిది నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఉన్న ఊరిలో ఉపాధి లేక ఆరు నెలల క్రితం ఏజెంట్‌కు డబ్బులు పెట్టి ఇరాక్ దేశంలోని ఇబ్రహీల్ పట్టణానికి వెళ్లాడు. విధులు నిర్వహిస్తుండగా జనవరి 30న బ్రేన్ స్ట్రోక్ వచ్చింది. వెంటనే కంపెనీ సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటి నుంచి భర్త మృతదేహం కోసం కంటిలో నీరు కడుపులో దాచుకుని భార్య ఎదురుచూస్తోంది. శుక్రవారం పెట్టెలో భర్త మృతదేహం స్వగ్రామానికి రావడంతో భార్య రోదన ఎవరు ఆపలేకపోయారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు కల్లెడ భూమన్న, వర్కింగ్ ప్రసిడెంట్ తిరుపతి, సంఘం నాయకులు ఎల్లయ్య, కునారపు భీమరాజు మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పుల పాలైనా వెంకటేశ్ కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతదేహం స్వగ్రామం రావడానికి సహకరించిన ఎమిగ్రేట్ అసోసియేషన్ అధ్యక్షుడు మంద భీంరెడ్డి, అంబులెన్స్ ఏర్పాటు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రాణం పోసిన సీపీఆర్



భైంసా ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

భైంసారూరల్: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం చాతా గ్రామానికి చెందిన వాడేకర్ విఠల్ శుక్రవారం గుండెపోటుతో ఇంట్లో కుప్పకూలిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే 108కు సమాచారం అందించారు. అయితే పరిస్థితి విషమిస్తుండడంతో కారులో భైంసా ఆస్పత్రికి తీసుకువస్తున్నారు. మార్గమధ్యలో గుండేగాం వద్ద అంబులెన్సు ఎదురు కావడంతో కారు ఆపి విఠల్‌ను అంబులెన్స్‌లోకి మార్చారు. పరిస్థితి విషమించడంతో ఈఎంటీ పూజారి లక్ష్మణ్, పైలెట్ ఖాజామోయినొద్దీన్ అతడికి సీపీఆర్ చేసి పల్స్ అందేలా చూశారు. అనంతరం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. సీపీఆర్ చేసి పల్స్ అందించిన సిబ్బందిని పలువురు అభినందించారు.

మద్యం మత్తులో కిందపడి ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మద్యం మత్తులో కిందపడి ఒకరు మృతిచెందిన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై వెంకటరమణ రెడ్డి ప్రకారం.. జైనథ్ మండలం గూడ గ్రామానికి చెందిన పొట్ట దేవిదాస్ (40) కొన్ని రోజులుగా మద్యానికి బానిస కావడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో కింద పడిపోవడంతో స్థానికులు అంబులెన్స్‌లో రిమ్స్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఉమా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండె పోటుతో బీటెక్ విద్యార్థిని మృతి



నార్వాడే హాసిని

నర్సాపూర్(జి): మండలంలోని బామిని(బి) గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థిని గుండెపోటుతో మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వివరాల మేరకు... మండలంలోని బామిని(బి) గ్రామానికి చెందిన నార్వాడే హాసిని(18) హైదరాబాద్‌లో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. ఆరోగ్యం బాగలేకపోవడంతో ఇటీవల ఇంటికి వచ్చేసింది. గురువారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెందింది. తండ్రి నార్వాడే వెంకట్‌రావు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కూతురు మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

గోదావరిలో మునిగి ఒకరి మృతి

భైంసా: బాసర గోదావరి నదిలో శుక్రవారం స్నానానికి దిగి ప్రమాదవశాత్తు సురేశ్(50) నీటిలో మునిగి మృతిచెందాడు. నిజామాబాద్ జిల్లాకు చెందిన సురేశ్ బాసరకు వచ్చాడు. తన మనువడి పుట్టెంట్రుకలు తీసే కార్యాన్ని బాసరలో నిర్వహించారు. బాసరకు వచ్చిన ఆయన కుటుంబీకులతో కలిసి గోదావరి నది తీరానికి వచ్చాడు. నదిలో స్నానం ఆచరించేందుకు దిగి ప్రమాదవశాత్తు అదే నీటిలో మునిగి మృతిచెందాడు. అక్కడే ఉన్న జాలర్లు మృతదేహాన్ని బయటకు తీశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు.

పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య



సంతోష్ (ఫైల్)

సోన్: మద్యానికి బానిసై ఒకరు పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని న్యూవెల్మల్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... అల్లకొండ సంతోష్(47) నాలుగు నెలల క్రితం కూతురి వివాహం చేశాడు. అప్పటి నుంచి ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. మద్యం మానేయాలని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన సంతోష్ పురుగుల మందుతాగాడు. అపస్మారకస్థితిలోకి వెళ్లిన సంతోష్‌ను కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష రవీందర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయాలపాలైన సత్యం సాయన్న

భైంసారూరల్: భైంసా – నిర్మల్ జాతీయ రహదారిపై శుక్రవారం తిమ్మాపూర్ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సత్యం సాయన్న, ఉంబిరి సాయన్న ద్విచక్ర వాహనంపై కల్లూరు నుంచి తిమ్మాపూర్‌కు వెళ్తున్నారు. అదే క్రమంలో నిర్మల్ వైపు నుంచి భైంసా వైపునకు వస్తున్న కారు ఢీకొట్టింది. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్సులో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తనిఖీలకు వచ్చిన అధికారులు..

- అందుబాటులో లేని రైస్‌మిల్లు యాజమాన్యం
- శనివారం తనిఖీలు నిర్వహించేందుకు మిల్లుకు తాళం



రైస్‌మిల్లు గేటుకు తాళం వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలోని బాలాజీ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించేందుకు శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రాగా రైస్‌మిల్లులో యాజమాన్యం అందుబాటులో లేకుండా మిల్లుకు తాళం వేసి ఉండడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వెనుతిరిగారు. ఈ సందర్భంగా తాళం వేసి ఉన్న రైస్‌మిల్లు సీల్‌వేసి చేశారు. అలాగే రైస్‌మిల్లు గేటుకు తాళాలు వేసి వెళ్లారు. రైస్ మిల్లు తనిఖీలు శనివారం కొనసాగిస్తామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాస్ తెలిపారు. తనిఖీల్లో ఇన్‌చార్జి తహసీల్దార్ బక్కయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్యాంలాల్ ఉన్నారు.

తూకం వేశాకే సరఫరా చేయాలి



సూచనలిస్తున్న శ్యామలాదేవి

జైనథ్: ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జీలు రేషన్ బియ్యాన్ని తూకం వేశాకే షాపులకు సరఫరా చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను డీఎస్వో కిరణ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. బియ్యం నిల్వలు, సరఫరా లాంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లీగల్ మెట్రాలజీ స్టాంపింగ్‌తో కూడిన ఎలక్ట్రానిక్ కాంటాలు అన్ని ఎంఎల్ఎస్ పాయింట్లకు అందించడం జరిగిందన్నారు. వాటి ద్వారా 50కిలోల చొప్పున బియ్యాన్ని తూకం వేసి తరుగు రాకుండా డీలర్లకు అందించాలన్నారు. అలాగే ఒకసారి ఉపయోగించిన మంచి గన్నీబ్యాగ్‌లో మాత్రమే బియ్యాన్ని రైస్‌మిల్లర్ల నుంచి తీసుకోవాలని సూచించారు. డీలర్లకూ మంచి గన్నీ బ్యాగ్‌లలో మాత్రమే బియ్యాన్ని సరఫరా చేయాలని ఆదేశించారు. భారత్ బ్రాండ్ రైస్‌ను విక్రయాలు చేపట్టే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. తహసీల్దార్ మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.